మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 11-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 12 Issue: 12

Circulated to Telangana
Published from Jagitial

11 జూలై 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి ద్వాదశి రా. 2:02 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం కృతిక ఉ. 11:00 వరకు తరువాత రోహిణి యోగం గండ రా. 12:00 వరకు కరణం కౌలవ మ. 3:42 వరకు తైతుల రా. 2:02 వరకు వర్జ్యం రా. 1:20 నుండి రా. 2:46 వరకు దుర్ముహూర్తం ఉ. 7:36 నుండి ఉ. 8:28 వరకు రాహుకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:44 వరకు యమగండం మ. 1:58 నుండి మ. 3:36 వరకు గుళికకాలం తె. 5:52 నుండి ఉ. 7:29 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు ఉ. 8:52 నుండి ఉ. 10:19 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# హరీశే.. ఒట్టేసి చెప్పు!

## బీజేపీతో మంతనాలు చేయడం లేదా?

### కాదని భద్రాద్రి రామయ్యపై ఒట్టేయగలవా?

### మేడిగడ్డ నింపితే భద్రాచలానికి ముంపు

### ఖమ్మం సభలో సీఎం రేవంత్ రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశామని, ఆయనకు ఇక విముక్తి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని, రాబోయే రాజకీయ "కురుక్షేత్రం"లోనూ కాంగ్రెస్‌దే విజయం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లిలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్‌ను గత ఎన్నికల్లో ప్రజలు పాతాళానికి తొక్కారని, రాబోయే ఎన్నికల్లో కూడా అదే పరిస్థితి పునరావృతమవుతుందని అన్నారు.

ఖమ్మం, జూలై 10 (ఈవార్తలు): తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం అసెంబ్లీ స్థానాలు 182కు, పార్లమెంట్ స్థానాలు 25కు పెరుగుతాయని పేర్కొంటూ, 182 స్థానాల్లో 117 స్థానాలు గెలిచి కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీలో చేరేందుకు హరీశ్‌రావు మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోందని పేర్కొన్న సీఎం, అలాంటి చర్చలు జరగడం లేదని భద్రాచలం శ్రీరాముడిపై ఒట్టు వేసి చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నిర్వహించిన సర్వేల్లో బీఆర్ఎస్ గెలుస్తోందని తరువాయి 2 వ పేజీలో...



# ఒట్టేసి ఒక మాట.. వేయకుండా ఒక మాట చెప్పను!

## నీలా నేను పార్టీలు మారను

### నాది ఆ రాజకీయ సంస్కృతి కాదు

### అసలు నీ రుణమాఫీ సంగతేంది?

### కనీసం ఖమ్మంలోనైనా పూర్తయ్యిందా?

### ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్ కౌంటర్

బీజేపీ నాయకులతో తాను మంతనాలు జరుపుతున్నానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పార్టీ మారడం తన రాజకీయ సంస్కృతి కాదని, రెండు దశాబ్దాలకుపైగా తన రాజకీయ జీవితంలో ఎలాంటి అవకాశవాద రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సీఎం ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. మాట తప్పడం, పార్టీలు మారడం ముఖ్యమంత్రి రాజకీయ సంస్కృతి కావొచ్చని, కానీ తనది కాదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన హామీ ఏమైందని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తాన్ని పక్కనబెడితే, కనీసం ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా అని నిలదీశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యమని హరీశ్‌రావు విమర్శించారు. లక్ష తరువాయి 2 వ పేజీలో...



ఖమేనీ అంత్యక్రియలు పూర్తి కార్యక్రమానికి 4 కోట్లకు పైగా జనం 2

# అక్క రాజ్యం చూపిస్తా

## మా సర్కారు వస్తే రైతును రాజును చేస్తా

### పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతాం

### గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టా

### టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత వెల్లడి



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు.

కొత్తగూడెం, జూలై 10 (ఈవార్తలు): మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన తరువాయి 2 వ పేజీలో...

# తెలంగాణే ఫస్ట్.. తర్వాతే పార్టీ



### కాళేశ్వరం ప్రాజెక్టు తప్పుబట్టడం సరికాదు

### వెంటనే మోటార్లు ఆన్ చేసి సాగునీరు అందించాలి

### కాళేశ్వరం వల్లే ఉత్తర తెలంగాణలో రెండు పంటలు

### ప్రాజెక్టుల మరమ్మతుల్లో జాప్యం చేస్తే తీవ్ర కరవు

### బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టీకరణ

ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు.

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్సారెస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,482 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,997 |




# 'అయ్యప్ప సంగమం'రద్దు

## ఆన్‌లైన్‌లో వసతి గృహాల బుకింగ్

### భక్తుల రద్దీ నియంత్రణకు ఏఐ.. దేవస్వం బోర్డు భారీ సంస్కరణలు

శబరిమల వార్షిక యాత్రను పురస్కరించుకుని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కీలక సంస్కరణలను ప్రకటించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యాత్రా నిర్వహణను ఆధునికీకరించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా గతంలో వివాదాస్పదంగా మారిన 'అయ్యప్ప సంగమం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది.

శబరిమల: 'అయ్యప్ప స్వామికి ఎలాంటి ప్రచారం అవసరం లేదు' అని బోర్డు అధ్యక్షుడు కె. జయకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నవంబర్ మధ్యలో ప్రారంభమయ్యే రెండు నెలల యాత్ర సీజన్‌కు ముందే ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. నూతన సంస్కరణల ప్రకారం భక్తులకు అందించే సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. రద్దీని పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని బోర్డు భారీగా విస్తరించింది. సన్నిధానంలోని తరువాయి 2 వ పేజీలో...



# అధిక ఆల్కహాల్ మందులపై ఆంక్షలు

## ఇక ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి: కేంద్రం

న్యూఢిల్లీ: అధిక మోతాదులో ఆల్కహాల్ కలిగిన ఔషధాల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి ఉండి, 30 ఎంఎల్ కంటే పెద్ద ప్యాక్‌లలో విక్రయించే మందులకు ఇకపై డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేసింది. ఈ మేరకు డ్రగ్స్ రూల్స్, 1945ను సవరిస్తూ నేడు (జూలై 10) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటివరకు షెడ్యూల్ 'కే' కింద తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఆకలితో ఎవరూ నిద్రపోకూడదనే లక్ష్యంతో దుబాయ్‌లో బ్రెడ్ ఫర్ ఆల్' పథకం అమలవుతోంది. 2022లో ప్రారంభమైన ఈ వినూత్న పథకం ద్వారా నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ వెండింగ్ యంత్రాల ద్వారా అవసరమైన వారికి రోజులో 24 గంటలూ ఉచితంగా తాజా రొట్టెలు (బ్రెడ్) అందిస్తున్నారు. మసీదులు, సూపర్ మార్కెట్లు, కమ్యూనిటీ కేంద్రాలు వంటి ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో ఈ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఆహారం అవసరమైన ఎవరైనా ఎలాంటి నమోదు, ప్రశ్నలు లేదా గుర్తింపు అవసరం లేకుండానే యంత్రంలోని బటన్‌ను నొక్కి తాజా బ్రెడ్‌ను పొందవచ్చు. దీంతో అవసరంలో ఉన్నవారు ఎలాంటి సంకోచం లేకుండా తమ ఆహార అవసరాన్ని తీర్చుకునే అవకాశం కలుగుతోంది.




# సర్వీస్ కాల్స్‌కు 1600.. ప్రమోషన్స్‌కు 140

## ట్రాయ్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: 1600, 140 సిరీస్ ఫోన్ నంబర్ల వినియోగంపై ప్రజల్లో, మీడియాలో తలెత్తిన గందరగోళాన్ని నివృత్తి చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం స్పష్టతనిచ్చింది. ఈ నంబర్ల కేటాయింపు, వినియోగంపై టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఒక వివరణాత్మక ప్రకటన విడుదల చేసింది. ట్రాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం, 1600 సిరీస్ నంబర్లను కేవలం సేవాపరమైన, లావాదేవీలకు సంబంధించిన సమాచారం కోసమే కేటాయించారు. తరువాయి 2 వ పేజీలో...



# అంతరిక్షంలోకి 'వజ్ర కమలం'

## విక్రమ్-1తో చరిత్ర సృష్టించనున్న భారత్

బెంగళూరు: భారత్ తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగంలో ఓ అరుదైన కళాఖండం అంతరిక్షంలోకి వెళ్లనుంది. బెంగళూరుకు చెందిన కాస్మోస్ డైమండ్స్ రూపొందించిన ల్యాబ్-గ్రోన్ వజ్ర కమలాన్ని ఈ మిషన్‌లో పంపనున్నట్లు సంస్థ ప్రకటించింది. భారతదేశంలో తయారైన ల్యాబ్-గ్రోన్ డైమండ్ కళాఖండం అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి కానుంది. ఈ ప్రాజెక్టును ప్రకటిస్తూ విడుదల చేసిన తరువాయి 2 వ పేజీలో...

# 'ఈ20'తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు!

కానీ లాభాలు ఎన్నో: కేంద్రం




2

# రాశి ఫలాలు

11.7.2026

మేషం: ఆర్థిక వ్యవహారాలలో ఒక ఖచ్చితమైన ప్రణాళికకు వస్తారు. అయితే మీ మాట తీరు కాస్త పదునుగా ఉండే అవకాశం ఉంది, కాబట్టి కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు ఓపిక అవసరం. పాత పెట్టుబడుల నుండి అనుకూల ఫలితాలు అందుతాయి.

వృషభం: మీలో ఉత్సాహం, ఏదైనా సాధించాలనే పట్టుదల పెరుగుతాయి. ప్రభుత్వ లేదా ఉన్నతాధికారుల నుండి ఆశించిన మద్దతు లభిస్తుంది. నిర్ణయాలు వేగంగా తీసుకుంటారు, కానీ తొందరపాటు శారీరక అలసటకు దారితీయకుండా చూసుకోండి.

మిధునం: ఖర్చులు పెరిగే సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా విలాసాలు లేదా ప్రయాణాల కొరకు ధనవ్యయం కావచ్చు. పనులలో కొంత ఆలస్యం జరిగినా, పట్టుదలతో పూర్తి చేస్తారు. నిద్రలేమి లేదా మానసిక ఒత్తిడికి లోను కాకుండా ధ్యానానికి సమయం కేటాయించండి.

కర్కాటకం: మీకు అన్ని విధాలా అనుకూల ఫలితాలు ఉంటాయి. అన్నదమ్ములు లేదా పాత మిత్రుల సహాయంతో నిలిచిపోయిన పనులు సాఫీగా సాగుతాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడానికి లేదా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించడానికి ఇది అత్యంత అనుకూలమైన రోజు.

సింహం: వృత్తి, వ్యాపార రంగాలలో సానుకూల మార్పులు వస్తాయి. మీ పని తీరుకు కార్యాలయంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తాయి. కొత్త బాధ్యతలు చేపట్టడానికి మానసికంగా సిద్ధమవుతారు. పితృవర్గం నుండి ఆశించిన లాభం లేదా సలహా అందుతుంది.

కన్య: దూర ప్రయాణాలకు లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. తండ్రి తరపున ఆస్తుల వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. అదృష్టం కలిసివచ్చే రోజు.

తుల: పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. వాహనాలు నడిపేటప్పుడు, అలాగే అపరిచిత వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు జరిపేటప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం. అనుకోని చిన్నపాటి ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెట్టవచ్చు, వైద్య సలహాలు పాటించడం మంచిది.

వృశ్చికం: భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. జీవిత భాగస్వామితో ఉన్న చిన్నపాటి విభేదాలు తొలగిపోయి సఖ్యత పెరుగుతుంది. సమాజంలో మీ ప్రతిష్ట పెరుగుతుంది. నూతన పరిచయాలు వ్యాపార విస్తరణకు దోహదపడతాయి.

ధనస్సు: కోర్టు వ్యవహారాలు లేదా శత్రువులపై విజయం సాధిస్తారు. గతంలో ఉన్న అప్పుల ఒత్తిడి కొద్దిగా తగ్గుతుంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అనుకూలమైన సమయం. ఆరోగ్యం మెరుగుపడుతుంది, అయితే ఆహార నియమాలు పాటించడం ముఖ్యం.

మకరం: సంతాన ప్రగతి మీకు ఆనందాన్ని కలిగిస్తుంది. కళాత్మక మరియు సృజనాత్మక రంగాల వారికి మంచి అవకాశాలు వస్తాయి. షేర్ మార్కెట్ లేదా ఊహాజనిత పెట్టుబడుల విషయంలో కాస్త ఆలోచించి అడుగు వేయడం శ్రేయస్కరం.

కుంభం: గృహ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. భూమి, వాహనం లేదా గృహోపకరణాల కొనుగోలుకు సంబంధించిన చర్చలు ఫలవంతమవుతాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. వృత్తిపరంగా సాధారణ లాభాలు ఉంటాయి.

మీనం: చిన్నపాటి ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. తోబుట్టువులతో సృజనాత్మకమైన చర్చలు జరుగుతాయి. సమాచార రంగం మరియు కమ్యూనికేషన్స్ రంగాల్లో ఉన్నవారికి అద్భుతమైన ప్రశంసలు దక్కుతాయి.



# హరీశ్.. ఒట్టేసి చెప్పు!

**మొదటి పేజీ తరువాయి**

కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. నియోజకవర్గాల సంఖ్య, రిజర్వేషన్లపై స్పష్టత రాకముందే సర్వేలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను సీఎం తప్పుబట్టారు. ప్రస్తుతం పంపులు ప్రారంభిస్తే భద్రాచలం శ్రీరామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకూడదని హెచ్చరించారు.

## విద్యుత్‌పై బీఆర్ఎస్ ప్రచారం తప్పు

2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ సంక్షోభం వస్తుందని బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోందని సీఎం అన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న రేవంత్ రెడ్డి, రైతు భరోసా, రుణమాఫీ, బోనస్ తదితర పథకాల ద్వారా గత 30 నెలల్లో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో రైతుల కోసం వ్యయం చేయలేదని అన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తన రాజకీయ ప్రయాణంలో ఖమ్మం జిల్లా కీలక పాత్ర పోషించిందని సీఎం పేర్కొన్నారు. 2023లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు అని అన్నారు. ఆ తర్వాత ప్రజల్లో కాంగ్రెస్‌కు విస్తృత మద్దతు లభించిందని, అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని, రాష్ట్రంలో "ప్రజా పాలన" కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని ఆయన అన్నారు.



# అంతరిక్షంలోకి 'వజ్ర కమలం'

**మొదటి పేజీ తరువాయి**

వీడియోలో.. రాకెట్‌లో ఏ వస్తువును పంపాలనే విషయంలో తమ బృందం నెలల తరబడి చర్చించినట్లు సంస్థ తెలిపింది. ఒక పెద్ద వజ్రాన్ని పంపాలా, ప్రత్యేక ఆకృతిలో వజ్రాన్ని రూపొందించాలా అనే ఆలోచనలు చేసినప్పటికీ.. చివరకు భారత జాతీయ పుష్పమైన కమలాన్నే ఎంపిక చేసినట్లు వెల్లడించింది. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో కమలం పవిత్రత, సృష్టి, జ్ఞానోదయానికి ప్రతీకగా భావిస్తారని కంపెనీ పేర్కొంది. బుద్ధుడు, విష్ణువు, లక్ష్మీదేవి, బ్రహ్మ, సరస్వతీదేవి వంటి దైవాలతో కమలానికి ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రూపకల్పన చేసినట్లు వివరించింది. అలాగే 'కాస్మోస్' అంటే విశ్వం అనే అర్థం వస్తుందని, భారత సృష్టి తత్వంలో విశ్వం కమలం నుంచి ఉద్భవించిందనే భావన కూడా తమ ఎంపికకు కారణమైందని తెలిపింది.

## 'ఈ20'తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు!

**కానీ లాభాలు ఎన్నో: కేంద్రం**

న్యూఢిల్లీ: ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3–5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ–నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది.



# ఖమేనీ అంత్యక్రియలు పూర్తి

## కార్యక్రమానికి 4 కోట్లకు పైగా జనం

టెహ్రాన్: ఇరాన్ అధినేత అయతొల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియలు ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన అంతిమయాత్ర అనంతరం, మషద్ నగరంలోని పవిత్ర ఇమామ్ రెజా పుణ్యక్షేత్రంలో ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేశారు. ఇరాన్, ఇరాక్‌లలో జరిగిన ఈ అంతిమ యాత్ర కార్యక్రమాలలో సుమారు 4.1 కోట్ల నుంచి 4.3 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారని అంచనా. అంతిమ సంస్కారాలకు ముందు ఖమేనీ భౌతికకాయాన్ని ఇమామ్ రెజా పుణ్యక్షేత్రం చుట్టూ ప్రదక్షిణ చేయించి, డార్ అల్–ధిక్ర్ ప్రార్థనా మందిరంలో ఖననం చేశారు. పాయంబర్–ఎ–ఆజం ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో చివరి వీడ్కోలు కార్యక్రమం జరిగింది. మషద్ నగరంలో జరిగిన అంతిమయాత్రలో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. ఊహించని రీతిలో జనం పోటెత్తడంతో సమీప రహదారులపై కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాల్సి వచ్చింది.

# సర్వీస్ కాల్స్‌కు 1600.. ప్రమోషన్స్‌కు 140

**మొదటి పేజీ తరువాయి**

బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలకు చెందిన సంస్థలతో పాటు ప్రభుత్వ విభాగాల పౌరులకు సమాచారం అందించేందుకు ఈ సిరీస్‌తో ఫోన్ నెంబర్లను వినియోగిస్తాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ, ఐఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థల పరిధిలోని సంస్థలు పంపే ముఖ్యమైన అలర్ట్‌లు ఈ నంబర్ల నుంచే వస్తాయి. వినియోగదారుల విశ్వసనీయతను పెంపొందించేందుకు, 1600 సిరీస్ నుంచి వచ్చే కాల్స్‌ను టెలికాం ఆపరేటర్లు లేదా థర్డ్–పార్టీ యాప్‌లు బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడానికి అనుమతి లేదని ట్రాయ్ స్పష్టం చేసింది. అదేవిధంగా 140 సిరీస్ నంబర్లను పూర్తిగా ప్రచార (ప్రమోషనల్) కాల్స్ కోసం కేటాయించారు. వినియోగదారులు 'డూ నాట్ డిస్టర్బ్' రిజిస్ట్రీ ద్వారా ఈ కాల్స్‌ను నియంత్రించుకోవచ్చు. తమకు ఇష్టం లేని ప్రచార కాల్స్‌ను నిరోధించేందుకు డీఎన్‌డీ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని ట్రాయ్ పేర్కొంది.

# అధిక ఆల్కహాల్ మందులపై ఆంక్షలు

**మొదటి పేజీ తరువాయి**

మినహాయింపు పొందుతున్న ఈ తరహా ఔషధాలను, కఠిన నిబంధనలు అమల్లో ఉండే షెడ్యూల్ 'హెచ్1' జాబితాలోకి చేర్చింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరించిన ప్రిస్క్రిప్షన్‌తో మాత్రమే వీటిని విక్రయించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఫార్మసీలు వీటి అమ్మకాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి. తయారీ సంస్థలు సైతం ఈ ఔషధాల ఉత్పత్తికి ప్రత్యేక లైసెన్సులు పొందడం తప్పనిసరి. కొన్ని రకాల టానిక్‌లు, దగ్గు మందులలో 80 నుంచి 90 శాతం వరకు ఆల్కహాల్ ఉన్నప్పటికీ, వాటిలో సుగంధ ద్రవ్యాలు ఉన్నాయన్న కారణంతో ఇప్పటిదాకా మినహాయింపులు ఉండేవి. అయితే, వీటిని వైద్యేతర అవసరాలకు, మత్తు కోసం విరివిగా వాడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) గుర్తించాయి. ఈ నేపథ్యంలోనే గతేడాది అక్టోబర్‌లో ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యంతరాలు మరియు సూచనలను స్వీకరించిన ప్రభుత్వం, తాజాగా ఈ తుది నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చాయి. ఆరోగ్య అవసరాల నిమిత్తం ఈ మందులు కావాల్సిన రోగులు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వం ప్రస్తుతానికి ఏ ఉత్పత్తిపైనా నిషేధం విధించలేదని, కేవలం నియంత్రణ చర్యలు మాత్రమే చేపట్టిందని స్పష్టం చేసింది. తక్కువ ఆల్కహాల్ మోతాదు ఉన్న లేదా 30 ఎంఎల్ లోపు ప్యాక్‌లకు ఈ నిబంధనలు వర్తించవని అధికారులు వెల్లడించారు.





# ఒట్టేసి ఒక మాట.. వేయకుండా ఒక మాట చెప్పను!

**మొదటి పేజీ తరువాయి**

క్యూసెక్కుల వరకు ప్రవాహం ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం పంపులను ప్రారంభించకపోవడం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లు చేసిన సూచనలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## ఏపీకి అనుకూలంగా రేవంత్ వ్యవహారం

తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాలను వినియోగించకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తమపట్నం వంటి ఎత్తిపోతల పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా నీటిని వినియోగించుకుంటుండగా, తెలంగాణ ప్రభుత్వం మాత్రం చేతులు ముడుచుకుని కూర్చుందని విమర్శించారు. ఈ వ్యవహారం వెనుక ఏదైనా "చీకటి ఒప్పందం" ఉందా అని ప్రశ్నించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరువవుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు భారీగా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాపై కూడా భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా సంబంధిత జిల్లాల మంత్రులు స్పందించడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ మంత్రులు రైతుల ప్రయోజనాల కోసం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించి, ఎల్లంపల్లి, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ తదితర రిజర్వాయర్లను నింపాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న ప్రతి చుక్క నీటిని వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

# తెలంగాణే ఫస్ట్.. తర్వాతే పార్టీ

**మొదటి పేజీ తరువాయి**

వివరించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# 'అయ్యప్ప సంగమం'రద్దు

**మొదటి పేజీ తరువాయి**

మొత్తం 690 గదుల్లో ఇకపై 550 గదులను భక్తులు ఆన్ లైన్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. గతంలో ఈ సంఖ్య కేవలం 190గా మాత్రమే ఉండేది. గదుల బుకింగ్‌కు సెక్యూరిటీ డిపాజిట్ విధానాన్ని రద్దు చేసి, కేవలం అద్దెతో పాటు నామమాత్రంగా రూ.50 సర్వీస్ ఛార్జిని మాత్రమే వసూలు చేయనున్నారు. భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు సన్నిధానంతో పాటు బోర్డు ప్రధాన కార్యాలయంలో ఏఐ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. పడిపూజ బుకింగ్‌లు 2048వ సంవత్సరం వరకు నిండిపోవడంతో, తంత్రి అనుమతితో రోజుకు ఒకటిగా ఉన్న పూజల సంఖ్యను ఐదుకు పెంచాలని బోర్డు యోచిస్తోంది. గత సీజన్‌లో మరణించిన 54 మంది భక్తుల కుటుంబాలకు రూ. 1 లక్ష చొప్పున బీమా సాయం అందజేయనున్నారు. వర్చువల్ క్యూ టిక్కెట్లపై వసూలు చేసే రూ. 5 సుంకం ద్వారా ఈ నిధులను సమకూరుస్తారు. వర్షాకాలం అనంతరం క్లీన్ కేరళ కంపెనీ ఆధ్వర్యంలో సన్నిధానం పరిసరాలను శుభ్రం చేయనున్నారు. అన్నదానం పథకాన్ని ప్రామాణీకరించి, ఎటువంటి విరామాల ప్రమేయం లేకుండా భక్తులందరికీ ఒకే తరహా కేరళ భోజనం అందించాలని నిర్ణయించారు. గతంలో నిర్వహించిన 'అయ్యప్ప సంగమం' కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఎస్ఎన్‌డీపీ యోగం ప్రధాన కార్యదర్శి వెల్లపల్లి నటేశన్ హాజరుకావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ కార్యక్రమం సంప్రదాయ భక్తులను దూరం చేసిందని, ఎన్నికల్లో వామపక్ష కూటమి ఓటమికి ఇది కూడా ఒక ప్రధాన కారణమని అప్పట్లో వాదన వినిపించింది.

# అక్క రాజ్యం చూపిస్తా

**మొదటి పేజీ తరువాయి**

వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.



## గోపాల్‌నగర్ రహదారి సమస్యను పరిష్కరిస్తా: బండి రమేశ్

కూకట్‌పల్లి, జూలై 10 (ఈవార్తలు): గోపాల్‌నగర్ ప్రధాన రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని బండి రమేష్ హామీ ఇచ్చారు. గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానుల విజ్ఞప్తి మేరకు ఆయన శుక్రవారం అక్కడికి వెళ్లి రహదారిని పరిశీలించి, ప్లాట్ యజమానులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్లాట్ యజమానులు మాట్లాడుతూ, గోపాల్‌నగర్ లేఅవుట్ 1980లో ఏర్పడగా, 1981లో తాము ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ఆమోదం పొందిన లేఅవుట్ ప్రకారం ప్రధాన రహదారి వెడల్పు 40 అడుగులుగా ఉందని, తమ వద్ద ఉన్న రిజిస్టర్డ్ విక్రయ పత్రాల్లో కూడా అదే నమోదు అయి ఉందని వివరించారు. మూసాపేట నుంచి లింగంపల్లి వరకు ఇదే రహదారి చాలా ప్రాంతాల్లో 60 నుంచి 80 అడుగుల వెడల్పుతో మాత్రమే ఉండగా, గోపాల్‌నగర్‌లో మాత్రమే 120 అడుగుల రహదారి పేరుతో భూములను సేకరించే ప్రయత్నం చేయడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత 40 ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో చట్టబద్ధంగా కొనుగోలు చేసిన తమ ప్లాట్ల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ప్లాట్ యజమానులు సమర్పించిన వినతిపత్రాలు, సంబంధిత పత్రాలను పరిశీలించిన బండి రమేష్ సమస్య తీవ్రతను గుర్తించి, సంబంధిత అధికారులతో చర్చించి న్యాయబద్ధమైన పరిష్కారం కోసం త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి భరోసా కల్పించినందుకు గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానులు బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ బాబు, వినోద్ చావా, శ్రీనివాస్, తిలక్, అనిల్, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## హీరోను చేస్తానని మోసం

**పిల్ల జమీందార్ దర్శకుడిపై కేసు**

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): ప్రముఖ తెలుగు చిత్ర దర్శకుడు అశోక్ బాబు మోసం కేసులో చిక్కుకున్నారు. తమ కుమారుడిని హీరోగా పరిచయం చేస్తానని నమ్మబలికి సుమారు రూ. 3.5 కోట్లు వసూలు చేసి వంచించారంటూ ఒక కుటుంబం ఫిర్యాదు చేయడంతో సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అధికారులు కేసు నమోదు చేశారు. హనుమంతరావు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు ప్రకారం, 2024 నుంచి 2026 జనవరి మధ్య కాలంలో దర్శకుడు అశోక్ పలు విడతలుగా ఈ మొత్తాన్ని స్వీకరించారు. తన కుమారుడిని హీరోగా వెండితెరకు పరిచయం చేయడమే కాకుండా, ప్రాజెక్టులో భాగస్వామ్యం కూడా కల్పిస్తానని ఆయన నమ్మబలికారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, సినిమా పట్టాలెక్కకపోవడంతో పాటు, తీసుకున్న డబ్బులు కూడా తిరిగి చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం దర్శకుడు అశోక్‌తో పాటు ఆయన భార్య విజయను, ఇతర ఆర్థిక లావాదేవీలతో సంబంధం ఉన్న వారిని విచారణకు పిలిపించారు. ప్రస్తుతం పోలీసులు నగదు బదిలీకి సంబంధించిన 'మనీ ట్రయల్'పై దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేశారు. 'పిల్ల జమీందార్', 'భాగమతి' వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన అశోక్, 'ఉషోదయం' చిత్రానికి గానూ ఉత్తమ బాలల చిత్ర దర్శకుడిగా నంది అవార్డును కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు దశలో ఉందని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు వెల్లడించారు.

## ఉత్తమ కంపెనీగా 'అరజెన్ లైఫ్ సైన్సెస్'

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ లైఫ్ సైన్సెస్ సంస్థ 'అరజెన్ లైఫ్ సైన్సెస్' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 'గ్రేట్ ప్లేస్ టు వర్క్-ఇండియా' 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన "ఇండియాస్ టాప్ 100 బెస్ట్ కంపెనీస్ టు వర్క్ ఫర్" జాబితాలో అరజెన్ చోటు సంపాదించింది. ఈ జాబితాలో స్థానం దక్కించుకున్న దేశంలోని తొలి, ఏకైక కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంఓ)గా అరజెన్ చరిత్ర సృష్టించింది. ఉద్యోగుల నుంచి సేకరించిన సర్వేలు, సంస్థలోని పని సంస్కృతి, నాయకత్వ పటిమ మరియు ఉద్యోగుల పట్ల యాజమాన్యం చూపే శ్రద్ధ వంటి అంశాలను స్వతంత్రంగా విశ్లేషించి ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు. ఉద్యోగుల మధ్య పరస్పర నమ్మకం, గౌరవం, నిష్పాక్షికత మరియు విశ్వసనీయత వంటి కీలక అంశాలకు ఇందులో అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఈ గుర్తింపుపై అరజెన్ లైఫ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ మణి కంటిపూడి హర్షం వ్యక్తం చేశారు. "భారతదేశంలోని అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా గుర్తింపు పొందడం మాకు గర్వకారణం. ఇది మా సంస్థ పని సంస్కృతిపై ఉద్యోగులు ఉంచిన నమ్మకానికి నిదర్శనం. గౌరవం, సహకారం మరియు నిరంతర అభ్యాసానికి చోటున్న వాతావరణంలోనే శాస్త్రీయ ఆవిష్కరణలు సాధ్యమవుతాయని మేము నమ్ముతాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 8 కేంద్రాలలో 5,000 మందికి పైగా ఉద్యోగులతో అరజెన్ కార్యకలాపాలు సాగిస్తోంది. వీరిలో 450 మందికి పైగా పీహెచ్‌డీ నిపుణులు ఉండటం విశేషం. అరజెన్ వరుసగా ఏడేళ్లుగా 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికేషన్ పొందడమే కాకుండా, గత నాలుగేళ్లుగా 'టాప్ 25 బెస్ట్ వర్క్‌ప్లేసెస్ ఇన్ ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్ అండ్ బయోటెక్' జాబితాలోనూ స్థానం దక్కించుకుంటూ వస్తోంది.

## రావణ్‌పై ఉపా కేసును వెనక్కి తీసుకోవాలి

విజయవాడ, జూలై 10 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ పై పోలీసులు ఉపా కేసు నమోదు చేయడం తెలిసిందే. అయితే, దేశద్రోహులపై ఉపయోగించే ఈ చట్టం కింద కేసు నమోదు చేయడం ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్యను ఇప్పటికే వైసీపీ ఖండిస్తుండగా... తాజాగా కమ్యూనిస్టులు కూడా ఈ జాబితాలో చేరారు. విజయవాడ వేదికగా జరిగిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో వైసీపీతో పాటు లెఫ్ట్ పార్టీలైన సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు ప్రస్తుతం అనేక ప్రజా సమస్యల్లో చిక్కుకుపోయాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అసలు విషయాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే రావణ్‌ను టార్గెట్ చేస్తూ ఈ రాజకీయ కుట్రకు తెరలేపారని ఆరోపించారు.



# 'సోషల్ మీడియా'పై టాస్క్ ఫోర్స్

**ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం**

అమరావతి, జూలై 10 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు. సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

**ముఖ్యాంశాలు:**

- రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.
- దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.
- విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.
- సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.
- ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.



# టీజీ-జనసేనలో భారీగా చేరికలు

**పవన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న నేతలు**

**పార్టీలోకి తెలంగాణ వర్సిటీ మాజీ వీసీ రవీందర్**

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు. వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీలో గిరిజన మ్యూజియం రగడ

**కొనసాగుతున్న విద్యార్థుల నిరసన.. వర్సిటీ గ్రౌండ్ ఫ్లోర్‌ను ప్రైవేట్ ట్రస్ట్‌కు ఇవ్వడంపై ఆగ్రహం**

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకుల నిరసనలు కొనసాగుతున్నాయి. వర్సిటీ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌ను 'ఆది ధ్వని' ట్రస్ట్‌కు గిరిజన కళల మ్యూజియం, పరిశోధన కేంద్రం ఏర్పాటు నిమిత్తం కేటాయించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళనలు శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కారణంగా ప్రస్తుతం కింది అంతస్తులో విద్యాభ్యాసం చేస్తున్న సుమారు 650 మంది విద్యార్థుల తరగతులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము గిరిజన సంస్కృతి పరిరక్షణకు వ్యతిరేకం కాదని, అయితే ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం అవసరాలను పక్కనబెట్టి ప్రైవేట్ ట్రస్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని వారు స్పష్టం చేశారు. "ప్రస్తుతం 650 మంది విద్యార్థులు చదువుకుంటున్న తరగతి గదులనే ఖాళీ చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఏ. శ్రీనివాసన్ పేర్కొన్నారు. బాచుపల్లిలో నూతన ప్రాంగణం ప్రారంభమైనప్పటికీ, అక్కడ ఆడిటోరియం, సెమినార్ హాళ్లు వంటి కీలక వసతులు లేకపోవడంతో నాంపల్లి ప్రాంగణంలోనే పలు విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివాదాస్పదంగా మారిన కింది అంతస్తులో తరగతి గదులతో పాటు, వైస్-ఛాన్సలర్ కార్యాలయం, ఆడిటోరియం, చిత్రవాణి స్టూడియో కూడా ఉన్నాయి. రిటైర్డ్ ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు నేతృత్వంలోని 'ఆది ధ్వని' ట్రస్ట్, విద్యార్థులకు గిరిజన కళలపై అవగాహన కల్పించేందుకు మ్యూజియం ఏర్పాటు చేయాలని సంకల్పించింది. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ ఇలాంటి ప్రతిపాదనే రాగా, అక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో మ్యూజియం ఏర్పాటు కోసం సచివాలయం సమీపంలోని బూర్గుల రామకృష్ణారావు భవన్ లేదా పబ్లిక్ గార్డెన్స్‌లోని లలిత కళా తోరణం వంటి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించాలని అధ్యాపక బృందం సూచిస్తోంది.

# స్క్రీన్ షాట్ల డిజిటల్ టికెట్లు చెల్లవు

**వాట్సాప్ ఫార్వార్డ్‌లూ చెల్లవు**

**ఫోన్‌లో ఒరిజినల్ టికెట్ చూపించాల్సిందే**

**రైల్వే శాఖ కీలక ప్రకటన**




న్యూఢిల్లీ: భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. 'రైల్ వన్' యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జూలై 8న తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపు కార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. అయితే, రైల్వే శాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్ చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 117 సీట్లు గెలుస్తాం

**2029 జూన్‌లోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలు**

**ఖమ్మం సభలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

ఖమ్మం, జూలై 10 (ఈవార్తలు): 2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు.

## బీఆర్ఎస్‌కు ఈటల వత్తాసు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, జూలై 10 (ఈవార్తలు): హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రతిపక్షాలపై విమర్శల జడివాన కురిపించారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కుంగిపోయే ప్రాజెక్టులు కట్టిన మీరు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువులు విధించడం హాస్యాస్పదమని మహేశ్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మార్క్ అభివృద్ధి చూసి ఆయనకు మిట్టమధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయన్నారు. హరీశ్ రావు ఒకవేళ కాంగ్రెస్‌లోకి వస్తానంటే... తమ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో (పీఏసీ) చర్చించి నిర్ణయం తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని నిలదీశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉండి నీళ్ల దోపిడీని ప్రశ్నించని ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్... ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందని అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అందరికీ ఒకటేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. కడియం శ్రీహరి, కొండా సురేఖ వివాదాలపై సచిన్ సావంత్, జగ్గారెడ్డిలతో కూడిన కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రతినిధులతో చర్చించి ఈ నెల 15న కొలిక్కి తెస్తామని కీలక అప్‌డేట్ ఇచ్చారు.

## ఫ్రెండ్స్ బర్త్‌డే గుర్తుచేసేలా వాట్సాప్ ఫీచర్

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగిస్తున్న మెసేజింగ్ యాప్ వాట్సాప్ మరో ఉపయోగకరమైన ఫీచర్‌ను తీసుకురానుంది. ఇకపై స్నేహితులు, కుటుంబ సభ్యుల పుట్టినరోజులు గుర్తుంచుకోవడానికి ప్రత్యేకంగా క్యాలెండర్ లేదా రిమైండర్ యాప్‌ల అవసరం లేకుండా.. వాట్సాప్‌లోనే బర్త్‌డే రిమైండర్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ యోచిస్తోంది. ప్రస్తుతం ఈ ఫీచర్ అభివృద్ధి దశలో ఉందని సమాచారం. 'వాబీటాఇన్ఫో' వివరాల ప్రకారం.. ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.26.27.3లో ఈ ఫీచర్‌కు సంబంధించిన వివరాలు గుర్తించారు.



# పల్లె పల్లె ఆడాలి..
# ఒలింపిక్స్ చేరాలి!

**సీఎం సంకల్పానికి పునాదులు పడాలి**
**దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందాలి**
**క్రీడా విప్లవానికి నాంది పలకాలి**

(రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ జర్నలిస్టు 'దూడం శ్రీశైలం' సూచనలు)

**ప్రపంచంలో అత్యున్నత క్రీడా మహోత్సవమైన ఒలింపిక్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం ఆశాజనకమే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ఈ సంకల్పం రాష్ట్రానికి కొత్త దిశను చూపుతోంది. అయితే ఒలింపిక్స్ నిర్వహించడం అనేది కేవలం ఒక స్టేడియం నిర్మాణంతో పూర్తయ్యే పని కాదు. ప్రపంచ ప్రమాణాలకు తగ్గ మౌలిక వసతులు, వేలాది అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దే వ్యవస్థ, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను వెలికితీసే విధానం, దీర్ఘకాలిక క్రీడా ప్రణాళిక.. ఇవన్నీ కలిసి పనిచేస్తేనే ఆ కల సాకారం అవుతుంది.**

## ఒలింపిక్స్ నిర్వహణకు ఏం కావాలి?

ఒలింపిక్స్ నిర్వహించాలంటే వేల ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక క్రీడా నగరం అవసరం. ప్రధాన ఒలింపిక్ స్టేడియం, అథ్లెటిక్స్ ట్రాక్, స్విమ్మింగ్ కాంప్లెక్స్, ఇండోర్ అరేనాలు, షూటింగ్ రేంజ్, వెలోడ్రోమ్, హాకీ, ఫుట్‌బాల్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, బాక్సింగ్ వంటి అన్ని క్రీడలకు అంతర్జాతీయ ప్రమాణాల మైదానాలు ఉండాలి. క్రీడాకారుల కోసం ఒలింపిక్ విలేజ్, వేలాది గదులతో వసతి, మెట్రో, రహదారులు, వైద్య కేంద్రాలు, భద్రతా వ్యవస్థ, మీడియా సెంటర్లు వంటి భారీ మౌలిక సదుపాయాలు అవసరం.






## ప్రాథమిక పాఠశాల నుంచే ప్రతిభ గుర్తింపు

ఐదో తరగతి నుంచే విద్యార్థుల శారీరక సామర్థ్యాన్ని పరీక్షించి వారి ప్రతిభను నమోదు చేయాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతిభా పరీక్షలు నిర్వహించి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయాలి. వారికి ప్రత్యేక శిక్షణ, పోషకాహారం, కోచింగ్, వైద్య పరీక్షలు, క్రీడా సామగ్రి ఉచితంగా అందించాలి. ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఉండాలి. గ్రామ స్థాయిలో ఎంపికైన వారిని మండల స్థాయికి, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు శాస్త్రీయ పద్ధతిలో తీసుకెళ్లే వ్యవస్థ ఉండాలి. ప్రతి దశలో ప్రతిభను అంచనా వేసి అత్యుత్తమ క్రీడాకారులకు ప్రత్యేక అకాడమీల్లో శిక్షణ ఇవ్వాలి.

## పర్మిషన్లు - అంతర్జాతీయ ప్రమాణాలు

ఒలింపిక్స్ నిర్వహించాలంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిర్దేశించిన ప్రమాణాలు తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ మద్దతు, అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల అనుమతులు, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, ట్రాఫిక్ ప్రణాళిక, భద్రతా వ్యవస్థ, అంతర్జాతీయ విమానాశ్రయ సామర్థ్యం వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం తక్కువ. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి సందర్భాల్లో మాత్రమే ఆటలు నిర్వహించడం వల్ల ప్రపంచ స్థాయి క్రీడాకారులు తయారుకారు. అందుకే ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ కనీసం ఒక గంట క్రీడలకు కేటాయించడం తప్పనిసరి చేయాలి. పరీక్షలకు ఉన్న ప్రాధాన్యంతో పాటు శారీరక దారుఢ్యానికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.





## ప్రభుత్వానికి సవాళ్లు

భూసేకరణ, భారీ నిధుల సమీకరణ, అంతర్జాతీయ ప్రమాణాల నిర్మాణాలు, నాణ్యమైన కోచ్‌ల కొరత, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల లోపం, శిక్షణా వ్యవస్థ బలోపేతం వంటి అనేక సవాళ్లు ఉన్నాయి. వీటిని అధిగమించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక, రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం అవసరం. క్రీడా రంగాన్ని విద్యలో భాగంగా మార్చాలి. ప్రతి పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌ను తప్పనిసరి చేయాలి. జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. విదేశీ కోచ్‌ల సేవలు వినియోగించాలి. ప్రతిభను రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేయాలి. ప్రతి సంవత్సరం రాష్ట్ర క్రీడా పనితీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

### స్పోర్ట్స్ వర్సిటీ అవసరం

తెలంగాణలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీ కేవలం డిగ్రీలు ఇచ్చే విద్యాసంస్థ కాకూడదు. అంతర్జాతీయ కోచ్‌ల తయారీ, క్రీడా శాస్త్ర పరిశోధనలు, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజియోథెరపీ, బయోమెకానిక్స్, స్పోర్ట్స్ సైకాలజీ, న్యూట్రిషన్, డేటా అనలిటిక్స్ వంటి విభాగాలతో దేశంలోనే అత్యుత్తమ కేంద్రంగా ఎదగాలి. తెలంగాణ గ్రామాల్లో సహజసిద్ధమైన ప్రతిభ ఉంది. కానీ ఆర్థిక ఇబ్బందులు, సరైన శిక్షణ లేక చాలామంది మధ్యలోనే క్రీడలను వదిలేస్తున్నారు. అలాంటి వారికి నెలవారీ స్టైపెండ్, ఉచిత వసతి, ఆహారం, ప్రయాణ భత్యం, విద్యా సౌకర్యాలు కల్పించాలి. పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేక క్రీడా స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి.



### ప్రత్యేక బడ్జెట్ అవసరం

రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రతి మండలంలో ఒక మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ప్రతి జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాల స్టేడియం ఏర్పాటు చేయాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్, ఉన్నత విద్యలో ప్రత్యేక కోటా, ఉచిత వైద్యం, ప్రమాద బీమా, గృహ స్థలాలు, నగదు ప్రోత్సాహకాలు, జీవితాంతం పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అప్పుడు మాత్రమే యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటారు.

## ఒలింపిక్స్ లక్ష్యం ఎంతవరకు సాధ్యం?

దృఢ సంకల్పం, నిరంతర ప్రణాళిక, భారీ పెట్టుబడులు, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను తీర్చిదిద్దే వ్యవస్థ ఉంటే హైదరాబాద్ భవిష్యత్తులో ఒలింపిక్స్ నిర్వహించే నగరంగా ఎదగడం అసాధ్యం కాదు. కానీ మైదానాలు నిర్మించడం మాత్రమే కాదు... పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయడమే అసలు విజయానికి కొలమానం. క్రీడా విప్లవం పల్లె నుంచి ప్రారంభమైతేనే.. హైదరాబాద్ ఒలింపిక్స్ ఆతిథ్య నగరంగా ప్రపంచ పటంలో నిలుస్తుంది.

- దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9133947176.

# బీజేపీ వల్లే చల్‌గల్‌లో కేవీకి భూ కేటాయింపులు

## డాక్టర్ భోగ శ్రావణి వెల్లడి.. పూర్తిస్థాయి వర్సిటీ కోసం మరో 5 ఎకరాలు కేటాయించాలని డిమాండ్

జగిత్యాల, జూలై 10 (ఈవార్తలు): జగిత్యాలలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు చల్‌గల్ వాలంటరీ సెంటర్‌లో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను బీజేపీ స్వాగతిస్తోందని పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ చేసిన నిరంతర పోరాటానికి దక్కిన విజయమే ఈ నిర్ణయమని పేర్కొన్నారు. జగిత్యాలలోని కమలనిలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కేంద్రియ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ ప్రాంతమే అనుకూలమని కేంద్రియ విద్యాలయ సంఘటన్ అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనవసర జోక్యంతో ఏడాది పాటు జాప్యం జరిగిందని ఆరోపించారు. అధికారులు అనువుగా లేని స్థలాలను తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. చల్‌గల్‌లోనే కేంద్రియ విద్యాలయం ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ చేపట్టిన నిరాహార దీక్షను అడ్డుకున్నారని, బీజేపీ నాయకులను అరెస్టు చేశారని విమర్శించారు. చివరకు బీజేపీ పోరాటం వల్ల విద్యార్థుల ప్రయోజనాలే గెలిచాయని అన్నారు. ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, పూర్తిస్థాయి కేంద్రియ విద్యాలయానికి 10 ఎకరాల స్థలం అవసరమని తెలిపారు. క్రీడా మైదానం, ఇతర మౌలిక వసతుల కోసం మరో ఐదు ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జూలై 12న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో కేంద్రియ విద్యాలయానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేవీ మంజూరుకు కృషి చేసిన ఎంపీ అరవింద్‌కు, భూమి కేటాయింపునకు సహకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాదరి అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, ముత్యం రెడ్డి, కాశెట్టి తిరుపతి, పూదరి శ్రీనివాస్, బద్దెల గంగరాజం తదితరులు పాల్గొన్నారు.





# కేసీఆర్‌పై రేవంత్‌కు ద్వేషం

**రైతులకు అన్యాయం చేస్తుండు.. ప్రాణహిత జలాలు వృథా చేస్తుండు**

**మేడిగడ్డ మరమ్మతులు చేపట్టాలి.. మాజీమంత్రి జీవన్ రెడ్డి మండిపాటు**

జగిత్యాల, జూలై 10 (ఈవార్తలు): ప్రాణహిత జలాలను వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ద్వేషంతో వ్యవహరించడం వల్లే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విమర్శించారు. జగిత్యాలలోని తెలంగాణ భవన్‌లో జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత జలాల వినియోగానికి ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేకపోయాయని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మహారాష్ట్రతో చర్చలు జరిపి కేంద్ర జల సంఘం అనుమతులతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం చేపట్టారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు పరిశీలించిన తర్వాతే ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేశాయని చెప్పారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థ దెబ్బతిన్న స్తంభాలకు మరమ్మతులు చేసి వినియోగించుకోవచ్చని నివేదిక ఇచ్చినా ప్రభుత్వం ఏడాదిగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మేడిగడ్డ నిర్మాణ వ్యయం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో స్వల్ప భాగమేనని, నిర్మాణ సంస్థ మరమ్మతులకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో పేర్కొన్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కన్నెపల్లి పంపు ద్వారా నీటిని ఎగువకు ఎత్తిపోయే అవకాశాన్ని వినియోగించుకోవాలని, రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీని నింపే ప్రణాళికలను గత ప్రభుత్వం రూపొందించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఇంజినీర్ల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, పరిస్థితులు మరింత విషమించకముందే నీటి నిర్వహణపై చర్యలు చేపట్టాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, నాయకులు శీలం ప్రవీణ్ కుమార్, గాజుల రాజేందర్, , ముకస్సర్ అలీ నేహాల్, ముంజాల రఘువీర్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే శారీరక దృఢత్వం: ఎస్పీ అశోక్

జగిత్యాల, జూలై 10 (ఈవార్తలు): శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలే ఉత్తమ మార్గమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో వార్షిక జిల్లా పోలీసు క్రీడలను శుక్రవారం స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ పరేడ్ మైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం విధుల్లో ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించడంతో పాటు స్నేహభావం, జట్టుస్ఫూర్తి పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఉద్యోగుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు ప్రతి ఏడాది జిల్లా పోలీసు శాఖ ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీసు బృందం పరేడ్ నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించింది. అనంతరం ఎస్పీ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లను గాలిలోకి వదిలి క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో, నిష్పక్షపాతంగా పోటీల్లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో పోటీపడి తమ ప్రతిభను చాటుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం ఆయన స్వయంగా రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ క్రీడోత్సవంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, క్యారమ్, చెస్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, సైదులు, వేణు, ఎస్ఐలు, జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళ ప్రాణాలు కాపాడిన హోంగార్డుకు అభినందనలు



జగిత్యాల, జూలై 10 (ఈవార్తలు): జగిత్యాల కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ సమయస్ఫూర్తితో స్పందించి ఓ మహిళ ప్రాణాలను కాపాడిన హోంగార్డు కొత్తపల్లి సతీష్ కుమార్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. కలెక్టరేట్ ఆవరణలో ఓ మహిళ పురుగుమందు తాగేందుకు ప్రయత్నించగా, అక్కడే విధుల్లో ఉన్న సతీష్ కుమార్ వెంటనే స్పందించి ఆమె చేతిలోని పురుగుమందు సీసాను లాక్కొని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం మహిళను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించి, పురుగుమందు సీసాను జగిత్యాల టౌన్ పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తత, సమయస్ఫూర్తి, మానవత్వంతో స్పందించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని అన్నారు. సతీష్ కుమార్ వేగంగా స్పందించి ఒక విలువైన ప్రాణాన్ని కాపాడడం అభినందనీయమని కొనియాడారు. ఆత్మహత్య ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రాణం అమూల్యమైనదని, క్షణిక ఆవేశంలో తీసుకునే నిర్ణయం కుటుంబ సభ్యులకు తీరని వేదన మిగులుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

# ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

**వెల్గటూర్ మండలంలో రోడ్డు ప్రమాదం**

వెల్గటూర్, జూలై 10 (ఈవార్తలు): వెల్గటూర్ మండలంలోని ఎండపల్లి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలం మడక గ్రామానికి చెందిన నూనె రాజు (45) ద్విచక్ర వాహనంపై వెల్గటూర్ నుంచి ధర్మారం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమార్తె పెసరి శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ అంబారిపేట గ్రామానికి చెందిన ఆరెల్లి ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్గటూర్ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై రవీందర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# యువత డ్రగ్స్ బారిన పడొద్దు

**నషా ముక్త్ భారత్ అభియాన్ విజయవంతం చేయాలి**

**ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహితంగా మారాలి..**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



ధర్మపురి, జూలై 10 (ఈవార్తలు): దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన యువతతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురిలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్--వికసిత్ భారత్ కి పహచాన్' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి విద్యాసంస్థను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో యువతను సరైన దిశలో నడిపించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల వ్యక్తితో పాటు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు, సందేశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నైపుణ్యాల పెంపుపై దృష్టి

**జగిత్యాల కలెక్టర్ బీ సత్యప్రసాద్**

(దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు)



జగిత్యాల, జూలై 10: జగిత్యాల జిల్లాలో విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో విరూపాక్షి గార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు కూడా కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించలేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్న కలెక్టర్, ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని ప్రాథమిక నైపుణ్యాలపై పూర్తి పట్టు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు మాసవారీ లక్ష్యాలను నిర్దేశించి వాటి పురోగతిని ప్రతి నెల సమీక్షిస్తామని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ప్రోత్సహించడంతో పాటు, వెనుకబడిన పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తామని వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో పీజీఐలో జగిత్యాల జిల్లా ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమైనప్పటికీ, మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తన తరగతికి తగిన చదువు సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సింగిల్ టీచర్ పాఠశాలలు, మల్టీగ్రేడ్ తరగతులు, తక్కువ హాజరు, బోధనా సామగ్రి వినియోగంలో లోపాలు, రెమెడియల్ బోధన వంటి సవాళ్లను సమిష్టిగా అధిగమించాలని తెలిపారు. బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ అంచనాల ఆధారంగా విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని ఆదేశించారు. సాంప్రదాయ బోధనకు బదులుగా భావనాత్మక, కార్యకలాపాల ఆధారిత, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, వినూత్న బోధనా విధానాలను ప్రతి నెల గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. 100 శాతం లక్ష్యాలను సాధించిన పాఠశాలలను స్వయంగా సందర్శించి, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని కలెక్టర్ ప్రకటించారు. నాణ్యమైన బోధనతో జగిత్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె. రాము, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్పీలు అభయ్ రాజ్, విజయ్, జయంత్, ప్రవీణ్, మహేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వలంటీర్లను నియమించాలి

**ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి**

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఎస్టీయూటీఎస్ వినతి**



జగిత్యాల, జూలై 10 (ఈవార్తలు): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గుణాత్మక విద్యను బలోపేతం చేయాలంటే ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చి, అవసరమైన చోట విద్యా వలంటీర్లను నియమించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూటీఎస్) జగిత్యాల జిల్లా శాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలేపు శివరామకృష్ణ శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించిన వారు, 50 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందుబాటులో లేని చోట విద్యా వలంటీర్లను నియమించి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 50 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో కనీసం ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఒక విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. డీఆర్‌పీలు, ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ బృందాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల స్థానాలను ప్రభుత్వ ఉపాధ్యాయులు లేదా విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని సూచించారు. ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదని, ఉపాధ్యాయుల కొరత తొలగిస్తేనే కనీస అభ్యసన సామర్థ్యాల (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను సమర్థంగా సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# గంగనాల ప్రాజెక్టు సైడ్‌వాల్ వద్దు

**అనుమతులు రద్దు చేసి పనులు నిలిపివేయాలి**

**ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ డిమాండ్**

ఇబ్రహీంపట్నం, జూలై 10 (ఈవార్తలు): గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ పరిధిలో చేపట్టనున్న సైడ్‌వాల్ నిర్మాణం గంగనాల ప్రాజెక్టుకు సాగునీటి ప్రవాహాన్ని అడ్డుకునే అవకాశమున్నందున వెంటనే ఆ పనులను నిలిపివేసి, ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులను కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులోని గంగనాల ప్రాజెక్టు పరిధిని ఆయన సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సైడ్‌వాల్ నిర్మాణం వల్ల గంగనాల ప్రాజెక్టుకు నీరు చేరే సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దాదాపు నాలుగు వేల ఎకరాల ఆయకట్టు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు. వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, నడికూడ, మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, దామరాజ్‌పల్లి, వాల్గొండ తదితర గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఒక ప్రాంత రైతులకు మేలు చేసే పేరుతో మరో ప్రాంత రైతుల సాగునీటి హక్కులను కాలరాయడం సరికాదన్నారు. వేములకుర్తి శివారులోని చెక్కలగండి నుంచి వచ్చే నీరు సృజాపూర్--సదర్మాట్ వైపు మళ్లే అవకాశం ఉందని, దీంతో గంగనాల ప్రాజెక్టు నీటి సరఫరా దెబ్బతింటుందని పేర్కొన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఏఈ అనిత, సదర్మాట్ బ్యారేజీ ఈఈ అనిల్, డీఈ సురేందర్, ఏఈ నవీన్‌కుమార్‌లతో చర్చించి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సైడ్‌వాల్ నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు నడుం బిగిద్దాం

**జగిత్యాల జిల్లా బాలల పరిరక్షణ అధికారి సురేశ్**

మల్యాల, జూలై 10 (ఈవార్తలు): మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఆదేశాల మేరకు కొండగట్టులోని పెద్దమ్మల కాలనీలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, బడి బయట ఉన్న పిల్లలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు వారి విద్యపై ఆధారపడి ఉంటుందని, ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలోనే ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులు, మహిళలు, గ్రామ పెద్దలకు బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికకు, 21 సంవత్సరాల లోపు బాలుడికి వివాహం జరిపించడం చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని వివరించారు. బాల్య వివాహాల వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని, అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా లభించవని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పిల్లల రక్షణ కోసం చైల్డ్ హెల్ప్‌లైన్--1098, పోలీసు అత్యవసర సేవలు 100, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ 112, మహిళల హెల్ప్‌లైన్ 181 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాజయ్య మాట్లాడుతూ పిల్లలను పాఠశాలకు పంపించడం ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తారని అన్నారు. తల్లిదండ్రుల ప్రవర్తన, సంభాషణ పిల్లల వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మల్యాల హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, పిల్లలతో భిక్షాటన చేయించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కదారి శ్రావణ్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్చన, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టేబుళ్లు మహేందర్, శ్రీకాంత్, జనార్ధన్, సీడీపీవో సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు మమత, పద్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లయ్యారి చిత్రం


నిక్కీ తంబోలి




## ఆగస్టు 7న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా, దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు వరుణ్ తేజ్ తన ఎక్స్ ఖాతాలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ, "2026.. ఆగస్ట్ 7... ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ" అని పేర్కొన్నారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా... భారత్, కొరియా నేపథ్యంలో సాగే కథతో విభిన్నమైన హారర్ కామెడీగా ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని వినూత్నమైన పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే మార్చి నెలలో కొరియాలో వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్యలపై కీలక సన్నివేశాలు, పాటలను చిత్రీకరించి చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఏప్రిల్‌లో విడుదలైన 'కమ్సహమ్నిదా' పాటకు మంచి స్పందన లభించింది.

## కాల్చాలనుకుంటే కాల్చేయ్

### భార్యపై గోవిందా చమత్కారం

బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా త్వరలో 'లాకప్: సచ్ యా సజా' రియాలిటీ షోలోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే ఈ షోలో ఆయన భార్య సునీత అహూజా కంటెస్టెంట్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాబోయే ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో ఆసక్తి రేపుతోంది. షోలోకి ఎంట్రీ ఇచ్చే ముందు గోవిందా తన భార్య సునీతపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా గోవిందా మాట్లాడుతూ... "సునీతకు అమ్మలాంటి ఆప్యాయత ఉంది. అందరినీ కలుపుకొనిపోయే గుణం ఆమెది. ఏళ్ల తరబడి నిస్వార్థంగా సేవ చేస్తోంది. ఆమెలోని దయ, కరుణ, బంధాలను కాపాడుకునే తీరు అద్భుతం" అని అన్నారు. తనకు, తన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక, తాజాగా విడుదలైన 'లాకప్' ప్రోమోలో గోవిందా వేదికపైకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడం కనిపించింది. ఈ సందర్భంగా షో జైలర్ ఫరా ఖాన్ సరదాగా గోవిందాను "ఆమెను కాల్చేయమని ఎందుకు సుపారీ ఇచ్చావు?" అని ప్రశ్నించారు. దీనికి గోవిందా అంతే చమత్కారంగా బదులిస్తూ.. "అయ్యో, నేనే జేబులో బుల్లెట్ తెచ్చాను. నన్ను ఛాతీలో కాల్చాలని అనుకుంటోంది కదా. ఇప్పుడే కాల్చేయమనండి" అని అన్నారు.

## అఖిల్ 'లెనిన్'కు సమంత విషెస్



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో నటి సమంత.. అఖిల్‌కు, చిత్ర బృందానికి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలపడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'లెనిన్' ట్రైలర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న సమంత, అఖిల్‌ను ట్యాగ్ చేస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. "లెనిన్ చిత్ర బృందానికి, అఖిల్‌కు ఆల్ ది వెరీ బెస్ట్. ఇప్పటికే 'పెద్ద బ్లాక్‌బస్టర్ వైబ్స్' కనిపిస్తున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. సమంత విషెస్ చెప్పడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది. కాగా, ఇటీవలే సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమాపై అఖిల్ కూడా ప్రశంసలు కురిపించారు. 'లెనిన్' ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఆ సినిమా కాన్సెప్ట్ చాలా ఫ్రెష్‌గా ఉందని, వైబ్ బాగుందని అన్నారు. ఇలా ఒకరి చిత్రాలపై మరొకరు పాజిటివ్‌గా స్పందించుకోవడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మూడేళ్ల విరామం తర్వాత అఖిల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'లెనిన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు తగ్గట్టే సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో అక్కినేని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## రామ్‌తో భాగ్యశ్రీ హింట్?



అఖిల్ అక్కినేని సరసన నటించిన లెనిన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగ్యశ్రీ బోర్సే చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద డిస్కషన్ కు దారితీశాయి. లెనిన్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో భాగ్యశ్రీకి ఫ్రెండ్, మ్యారీ, డేట్ అనే రాపిడ్ ఫైర్ టాస్క్ ప్రశ్న ఎదురైంది. మీరు వర్క్ చేసిన కో స్టార్స్ లో టాలీవుడ్ హీరోల్లో ఎవరిని ఫ్రెండ్‌గా ఎంచుకుంటారు? ఎవరితో డేటింగ్‌కు వెళ్తారు? ఎవరిని పెళ్లి చేసుకుంటారు? అనే ప్రశ్నలకు ఆమె సరదాగా స్పందించారు. ముందు ఫ్రెండ్ గా అఖిల్‌ను సెలెక్ట్ చేసుకుంటానని చెప్పింది. తాను ఇప్పటివరకు కలిసి నటించిన కో స్టార్స్ అందరికీ పెళ్లైపోయిందని, ఇక మిగిలింది ఒక్కరేనని నవ్వుతూ చెప్పింది. అయితే ఇక్కడ భాగ్యశ్రీ రామ్ పేరు డైరెక్ట్‌గా చెప్పకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం అది రామ్ పోతినేని ను ఉద్దేశించి చేసిన కామెంటే అని ఫ్యాన్స్, నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. ఈ కామెంట్స్ వెనుక మరో కారణం కూడా ఉంది. భాగ్యశ్రీ, రామ్ పోతినేని కలిసి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో నటించారు. ఆ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచే వీరిద్దరి మధ్య సన్నిహిత్యం పెరిగిందనే ప్రచారం సోషల్ మీడియాలో కొనసాగుతోంది. ఒకే లొకేషన్‌లో ఉన్నట్లు కనిపించే ఫోటోలను వేర్వేరుగా పోస్ట్ చేయడం, ఒకే సమయాల్లో విదేశీ ట్రిప్‌లకు వెళ్లారనే ఊహాగానాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అయితే ఆ వార్తలపై ఇద్దరూ ఎప్పుడూ రియాక్ట్ అవలేదు.

## లగ్జరీ లుక్‌లో తమన్నా

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కేవలం సినిమాలతోనే కాకుండా బిజినెస్ ఉమన్‌గానూ దూసుకుపోతోంది. తాజాగా ఆమె తన సొంత బ్రాండ్ 'తమన్నా ఫైన్ జ్యువెలరీ' ప్రమోషన్స్ కోసం చేసిన రాయల్ ఫోటోషూట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. "రేపటి రూపాన్ని మార్చుడానికి, ఇవాళ ఎన్నో విప్లవాత్మక మార్పులు కావాలి" అంటూ క్రేజీ క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన లుక్ అదిరిపోయింది. ఇక పెరల్స్, డైమండ్స్ కలబోసిన నగలు ధరించి, క్లాసీ అండ్ మోడ్రన్ ఔట్‌ఫిట్‌లో తమన్నా ఇచ్చిన పోజులు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి. తమన్నా తన లేటెస్ట్ జ్యువెలరీ క్యాంపెయిన్ కోసం ముత్యాలు, వజ్రాల కాంబినేషన్‌లో అద్భుతమైన డిజైన్లను ధరించింది.



## దుల్కర్, పూజా కొత్త చిత్రం.. శ్రీ శ్రీ



యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న హీరో దుల్కర్ సల్మాన్, స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే జంటగా నటిస్తున్న కొత్త సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇప్పటివరకు డీక్యూ41గా పిలుస్తున్న ఈ చిత్రానికి "శ్రీ శ్రీ" అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాలేజీ నేపథ్యంలో రూపొందించిన ఈ ఫస్ట్ లుక్‌లో దుల్కర్, పూజా హెగ్డే ఎంతో తాజాగా, రొమాంటిక్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. "ప్రేమ మళ్లీ చిగురిస్తుంది" అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జోడించడంతో, ఇది ఒక ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. రవి నేలకూడిటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై 10వ చిత్రంగా దీన్ని నిర్మిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జతకడుతున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి, జగపతి బాబు, రమ్యకృష్ణ వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గతంలో ఈ సినిమా షూటింగ్ స్టిల్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించగా, ఇప్పుడు విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ అంచనాలను మరింత పెంచాయి.




# 30 ఏళ్లలోపే 20 గోల్స్

## చరిత్ర సృష్టించిన ఎంబాపే

ఫిఫా వరల్డ్‌కప్‌లో కిలియన్ ఎంబాపే చరిత్ర సృష్టించాడు. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మెగా ఈవెంట్‌లో గోల్డెన్ బూట్ రేసులో దూసుకెళ్తున్న ఎంబాపే.. ఎనిమిదో గోల్ సాధించాడు. ప్రపంచకప్‌లో ఈ అతడికిది 20వ గోల్ కావడం విశేషం. తద్వారా 30 ఏళ్లలోపే ఈ మెగా టోర్నీలో 20 సార్లు బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపిన తొలి ఆటగాడిగా ఎంబాపే చరిత్రకెక్కాడు. సాకర్ ఆటలో అతిపెద్ద పండుగైన ఫిఫా వరల్డ్‌కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపే గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. గత సీజన్ రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందించాలనే కసితో ఉన్న ఎంబాపే.. ఎనిమిదో గోల్‌తో గోల్డెన్ బూట్ రేసులోకి దూసుకొచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై రెండో అర్ధ భాగంలో బంతిని ప్రత్యర్థి నెట్‌లోకి పంపిన ఫ్రాన్స్ కెప్టెన్.. ఈజిప్ట్‌పై గోల్‌తో టాప్‌లో కొనసాగుతున్న అర్జెంటీనా కెప్టెన్లి యోనల్ మెస్సీతో సమంగా నిలిచాడు. వరల్డ్‌కప్ అంటే చాలు చెలరేగిపోయే ఎంబాపే మొరాకోపై మెరుపు గోల్‌తో 30 ఏళ్లలోపే వరల్డ్‌కప్‌లో 20 గోల్స్ సాధించిన తొలి ఆటగాడిగానూ రికార్డు సొంతం చేసుకున్నాడు. మెస్సీ కూడా 21 గోల్స్‌తో తాను తక్కువేమీ కాదని నిరూపించుకున్నాడు.

# గంభీర్ పదవికి గండం?



ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత జట్టు కోల్పోవడంతో బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది ప్రదర్శనపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పదవి కూడా పరిశీలనలో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. గంభీర్ కాంట్రాక్టు 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు వరుస వైఫల్యాల నేపథ్యంలో అతని పనితీరును కూడా సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో 9 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలైంది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఇంగ్లండ్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. సిరీస్‌లోని తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో, మూడో మ్యాచ్‌లో ఏకంగా 125 పరుగుల భారీ తేడాతో భారత్ ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో 202 పరుగుల లక్ష్య ఛేదనలో కేవలం 76 పరుగులకే కుప్పకూలడం జట్టు పేలవ బ్యాటింగ్‌కు అద్దం పట్టింది. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా ఉన్న టీమిండియాకు ఇది వరుసగా రెండో టీ20 సిరీస్ ఓటమి కావడం గమనార్హం. ఇంగ్లండ్ పర్యటనకు ముందు, పసికూన ఐర్లాండ్ చేతిలో భారత్ 2-0 తేడాతో సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్‌పై భారత జట్టుకు అదే తొలి సిరీస్ పరాజయం. ఈ రెండు సిరీస్ ఓటములు ఒక కీలక మార్పు తర్వాత చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. ఈ సాహసోపేత నిర్ణయం తర్వాత జట్టు వరుసగా విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





# లార్డ్స్‌లో అదరగొట్టిన అమ్మాయిలు

## చారిత్రక టెస్టులో సీనియర్ల అర్ధశతకాలు

లార్డ్స్ వేదికగా జరుగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత జట్టు ఆలౌటైంది. ఓపెనర్ స్మృతి మంధాన (83), హర్మన్‌ప్రీత్ కౌర్(58)లు అర్ధ శతకాలతో పటిష్టమైన పునాది వేశారు. కానీ, ఇంగ్లండ్ స్పిన్నర్ మ్యాడీ విల్లియర్స్(2-79) ధాటికి మిడిలార్డర్ వైఫలమైంది. ఓవైపు వికట్లు పడుతున్నా బాధ్యతగా ఆడిన దీప్తి శర్మ(57) టెయిలెండర్లతో కలిసి పోరాడి స్కోర్ 280 దాటించింది.

**కానీ, ఒకే ఓవర్లో దీప్తిని, క్రాంతి గౌడ్‌ను ఔట్ చేసిన సోఫీ ఎకిల్‌స్టోన్(3-68) భారత ఇన్నింగ్స్‌కు తెరదించింది. ఇంగ్లండ్‌లోని లార్డ్స్ మైదానం వేదికగా జరుగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత జట్టు మూడో సెషన్‌లోనే కుప్పకూలింది. తొలి సెషన్‌లో.. ఆపై లంచ్ తర్వాత కూడా ధీటుగా ఆడిన టీమిండియాను ఇంగ్లండ్ బౌలర్లు 285కే కట్టడి చేశారు.**

టాస్ ఓడిన భారత్ రెండో ఓవర్లోనే ఓపెనర్ షఫాలీ వర్మ(0) వికెట్ కోల్పోయింది. షఫాలీ డకౌటవ్వగా.. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన యస్తికా భాటియా(12) సైతం నిరాశపరిచింది. 37 పరుగులకే రెండు కీలక వికెట్లు పడినా ఓపెనర్ స్మృతి మంధాన(83) ఒత్తిడకి లోనవ్వకుండా పట్టుదలగా ఆడింది.. జెమీమా రోడ్రిగ్స్(35)తో కలిసి ఆతిథ్య జట్టు బౌలర్లను కాచుకున్న ఈ లెఫ్ట్ హ్యాండర్ యాభైకి పైగా రన్స్ జోడించింది. ఇసీ వాంగ్ ఓవర్లో బంతిని వికెట్ల మీదకు ఆడుకొని జెమీమా బౌల్డైంది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(58)తో కలిసి స్కోర్ 120 దాటింది. అర్ధ శతకం పూర్తి చేసుకున్న మంధానతో పాటు హర్మన్‌ప్రీత్ క్రీజులో నిలవడంతో భోజన విరామానికి భారత్ మూడు వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. లంచ్ బ్రేక్ అనంతరం శతకానికి చేరువైన మంధానను ఇసీ వాంగ్ బోల్తా కొట్టించింది. అనంతరం సీనియర్ బ్యాటర్ దీప్తి శర్మ(57) జతగా ఇన్నింగ్స్ నిర్మించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ జట్టకు భారీ స్కోర్ అందించే బాధ్యత తీసుకుంది. వీరిద్దరూ ఆచితూచి ఆడుతూ స్కోర్ బోర్డును నడిపించారు. టెస్టుల్లో రెండో హాఫ్ సెంచరీ బాదిన హర్మన్‌ప్రీత్‌ను మ్యాడీ క్లీన్ బౌల్డ్ కావడంతో దీప్తి ఆ తర్వాత మరింత బాధ్యతగా ఆడింది. రీచా ఘోష్(13) విఫలమవ్వగా.. స్నేహ్ రాణా(13) తో కలిసి స్కోర్ 250 దాటించిందీ ఆల్‌రౌండర్. ఏడో వికెట్‌కు 45 రన్స్ జోడించిన ఈ జంటను ఎట్టకేలకు మ్యాడీ విడీసింది. అంపైర్ నాటౌట్ ఇవ్వగా రివ్యూ తీసుకున్న ఇంగ్లండ్ రాణా వికెట్ సాధించింది. ఎకిల్‌స్టోన్ తిప్పేయగా ఒకే ఓవర్లో దీప్తి, క్రాంతి గౌడ్() ఔటవ్వగా మూడొందలకు పైగా కొడుతుందనుకున్న అనూహ్యంగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285కే ఆలౌటైంది.



# మా ఓటమికి మేమే కారణం



ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నాలుగో టీ20 మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయి, మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను ఆతిథ్య జట్టుకు సమర్పించుకుంది. ఈ ఘోర పరాజయంపై భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తీవ్ర నిరాశ వ్యక్తం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్ సహా అన్ని విభాగాల్లో మరోసారి తమ ప్రణాళికలను అమలు చేయడంలో విఫలమయ్యామని అంగీకరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అజేయంగా 80 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేయడంతో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అయితే, ఈ లక్ష్యాన్ని ఇంగ్లండ్ జట్టు కేవలం 13.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించి సంచలన విజయం నమోదు చేసింది. మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "ఈ ఓటమి చాలా నిరాశపరిచింది. 158 పరుగులు ఈ పిచ్‌పై గెలిపించే స్కోరు కాదు. ఇంగ్లండ్ బ్యాటర్లు ఎంత వేగంగా ఛేదించారో మనందరం చూశాం. బౌలర్లకు సరైన లెంగ్త్‌లో బంతులు వేయమని సూచించాను. కానీ మా ప్రణాళికలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాం" అని తన అసంతృప్తిని వెళ్లగక్కాడు. వ్యక్తిగతంగా అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ, జట్టు ఓడిపోవడంతో తన ఇన్నింగ్స్‌కు విలువ లేకుండా పోయిందని అయ్యర్ ఆవేదన వ్యక్తం చేశాడు. "నా ప్రదర్శన పట్ల సంతోషంగానే ఉన్నా. కానీ, అది జట్టు గెలుపునకు ఉపయోగపడనప్పుడు దానికి అర్థం ఉండదు. నేను ఆడిన ప్రతిసారీ జట్టును గెలిపించాలని కోరుకుంటాను. దురదృష్టవశాత్తు ఈ రోజు అది జరగలేదు" అని తెలిపాడు.

# ఫైనల్‌కు హైదరాబాద్

## క్వాలిఫయర్-2లో కరీంనగర్ ఓటమి

తెలంగాణ టీ20 లీగ్-2026లో కరీంనగర్ డైమండ్స్ పోరాటం ముగిసింది. శుక్రవారం ఉప్పల్ వేదికగా హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2లో 8 వికెట్ల తేడాతో కరీంనగర్ పరాజయం పాలైంది. దీంతో కరీంనగర్ టోర్నీ నుంచి ఇంటిముఖం పట్టగా.. హైదరాబాద్ జట్టు ఆదివారం అన్విత ఖమ్మం ఏసెస్ జట్టుతో ఫైనల్లో తలపడేందుకు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ డైమండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ సింహా(38) టాప్ స్కోరర్‌గా నిలవగా.. శుభమ్ శర్మ(31), సాత్విక్ రెడ్డి(28) రాణించారు.కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ పది పరుగులు మాత్రమే చేశాడు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్, షణ్ముఖ, ప్రణవ్ తలా రెండు వికెట్లు సాధించారు. అనంతరం భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 15.3 ఓవర్లలో చేధించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి(45 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 82) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఓపెనర్ సాయి వికాస్ రెడ్డి(45) రాణించాడు. కరీంనగర్ బౌలర్లలో ఆఖిల్, శుభమ్ తలా వికెట్ సాధించారు.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# నవ్వు వెనుక నిశ్శబ్ద వేదన

మనిషి జీవితంలో అత్యంత విలువైన సంపద ఏమిటి? చాలామంది ఆరోగ్యం అని చెబుతారు. కానీ ఆరోగ్యం అంటే కేవలం శరీరం కాదు. మనసు కూడా అంతే ముఖ్యం. శరీరానికి గాయం అయితే బయటకు కనిపిస్తుంది. మనసుకు గాయం అయితే కనిపించదు. అదే నేటి సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద విషాదం. నవ్వుతున్న ముఖాల వెనుక ఎన్నో బాధలు దాగి ఉంటాయి. మాట్లాడుతున్న మనిషి లోపల మౌనంగా కూలిపోతూ ఉండవచ్చు. అందుకే మానసిక ఆరోగ్యాన్ని నిశ్శబ్ద సంక్షోభంగా అభివర్ణిస్తున్నారు. ఆధునిక జీవనశైలి మనిషికి అపారమైన సౌకర్యాలను ఇచ్చింది. కానీ అదే సమయంలో ప్రశాంతతను దూరం చేసింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు పరుగులు, లక్ష్యాలు, గడువులు, పోటీ, సామాజిక పోలికలు, ఉద్యోగ భద్రతపై ఆందోళన, కుటుంబ బాధ్యతలు..ఇవన్నీ కలిసి మనసుపై భారీ ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యంగా యువతలో ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి, ఉద్యోగాల కోసం పోటీ, ఉద్యోగులకు లక్ష్యాల ఒత్తిడి, వ్యాపారులకు ఆర్థిక అనిశ్చితి, రైతులకు ప్రకృతి అనిశ్చితి, వృద్ధులకు ఒంటరితనం..ప్రతి వర్గం ఏదో ఒక రూపంలో మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. సమస్యలు కొత్తవి కావు. కానీ వాటి తీవ్రత, వేగం మాత్రం పెరిగాయి. డిజిటల్ ప్రపంచం కూడా ఈ పరిస్థితికి ఒక కారణంగా మారింది. సోషల్ మీడియా మనుషులను కలిపిందనేది నిజమే. కానీ అదే సమయంలో అనవసర పోలికలను పెంచింది. ఇతరుల విజయాలు మాత్రమే కనిపించే ఈ ప్రపంచంలో చాలా మంది తమ జీవితాన్ని తక్కువగా అంచనా వేసుకుంటున్నారు. "అందరూ బాగున్నారు... నేను మాత్రమే వెనుకబడ్డాను" అనే భావన యువతలో ఆందోళనను పెంచుతోంది. వాస్తవ జీవితానికి, ఆన్‌లైన్ జీవితానికి మధ్య పెరుగుతున్న అంతరం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఇంకో పెద్ద సమస్య మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలు. జ్వరం వస్తే వైద్యుడిని కలుస్తాం. గుండె నొప్పి వస్తే పరీక్షలు చేయించుకుంటాం. కానీ ఆందోళన, నిద్రలేమి, తీవ్రమైన నిరాశ, భయం, భావోద్వేగ అస్థిరత వంటి సమస్యలు వచ్చినా చాలామంది సహాయం కోరడానికి వెనుకాడుతున్నారు. "ఇతరులు ఏమనుకుంటారు?", "నేను బలహీనుడిని అనుకుంటారా?" అనే భయం వారిని మౌనంలోకి నెడుతోంది. ఈ మౌనమే సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి. కార్యాలయాల్లో ఉత్పాదకత తగ్గుతుంది. విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. మాదకద్రవ్యాల వైపు మళ్లే ప్రమాదం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన నిర్ణయాలకు కూడా దారి తీసే పరిస్థితులు ఏర్పడతాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్యాన్ని ప్రజారోగ్య సమస్యగా గుర్తిస్తున్నారు. భారత్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా మనకు మానసిక ఆరోగ్యంపై మరింత పెట్టుబడి అవసరం. కానీ నిపుణుల కొరత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల లేమి, అవగాహన లోపం వంటి కారణాలతో చాలామంది చికిత్సకు దూరంగా ఉంటున్నారు. ప్రతి జిల్లా ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య సేవలు సమర్థంగా అందుబాటులో ఉండాలి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో కౌన్సెలింగ్ వ్యవస్థలు బలోపేతం కావాలి. తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకం. పిల్లలపై కేవలం మార్కుల ఒత్తిడి కాకుండా, వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో కనిపించే ప్రవర్తనా మార్పులను గమనించాలి. కార్యాలయాల్లో ఉద్యోగుల మానసిక శ్రేయస్సును కూడా పనితీరు అంతే ప్రాధాన్యంతో చూడాలి. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతివ్యక్తి కూడా కొన్ని అలవాట్లను పెంపొందించుకోవాలి. తగినంత నిద్ర, క్రమం తప్పని వ్యాయామం, కుటుంబంతో సమయం గడపడం, డిజిటల్ పరికరాల వినియోగాన్ని నియంత్రించడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం, మనసులోని భావాలను నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవడం వంటి చిన్న మార్పులు పెద్ద ఉపశమనాన్ని అందిస్తాయి. ప్రభుత్వం కూడా మానసిక ఆరోగ్యాన్ని ప్రజారోగ్య విధానాల్లో మరింత ప్రాధాన్యంతో చేర్చాలి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలల నుంచి ఉద్యోగ రంగం వరకు భావోద్వేగ ఆరోగ్య విద్యను ప్రోత్సహించాలి. టెలి-మెంటల్ హెల్త్ సేవలు, హెల్ప్‌లైన్‌లు, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో కౌన్సెలింగ్ సేవలను విస్తరించాలి.



డేటా సెంటర్లు తరలి వస్తున్నాయ్.. సంతోషం!

కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో భారత్ హబ్.. సంతోషం!

పెరగనున్న మౌలిక సదు-పాయాలు, ఉపాధి.. సంతోషం!

విద్యుత్తు వాడకం సంగతేంటి?

కర్బన ఉద్గారాల సంగతేంటి?

ఇవి రేపటి తరాలకు వెలుగునిస్తాయా?

గ్రీన్ హౌస్ దెబ్బకు చీకట్లే మిగులుతాయా?



# "డేటా సెంటర్ల వెలుగులు.. కావొద్దు చీకట్లు!

చుక్కల శ్రీకాంత్
నిజామాబాద్

**డిజిటల్** యుగంలో డేటానే కొత్త సంపద. ఒకప్పుడు బొగ్గు, చమురు దేశాల ఆర్థిక శక్తిని నిర్ణయిస్తే, నేడు సమాచారాన్ని నిల్వ చేసే డేటా సెంటర్లే భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పరిపాలన, విద్య, సోషల్ మీడియా, కృత్రిమ మేధ.. ఇవన్నీ డేటా సెంటర్లపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే భారత్‌లో కూడా ఈ రంగం అపూర్వ వేగంతో విస్తరిస్తోంది. దేశంలోని ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, నోయిడా వంటి నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. దేశీయ, అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్‌ను ఆసియాలో కీలక డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు కూడా ఈ రంగానికి ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధి, విదేశీ మారకద్రవ్య ఆదాయం వంటి అంశాల్లో ఇది సానుకూల పరిణామమే. కానీ ప్రతి అభివృద్ధికి ఒక ధర ఉంటుంది. ఆ ధరను ఎవరు చెల్లిస్తున్నారు? ఇదే ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న. డేటా సెంటర్ అనేది కేవలం కంప్యూటర్ల భవనం కాదు. రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా నిరంతరాయంగా పనిచేసే వేలాది సర్వర్ల సముదాయం. వీటిని నడపడానికి అపారమైన విద్యుత్ అవసరం. అంతేకాదు, సర్వర్లు అధిక వేడిని ఉత్పత్తి చేస్తాయి కాబట్టి వాటిని చల్లబరచడానికి కూడా భారీ స్థాయిలో శక్తి, అనేక ప్రాంతాల్లో గణనీయమైన నీటి వినియోగం అవసరమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు ఇప్పటికే మొత్తం విద్యుత్ వినియోగంలో గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. కృత్రిమ మేధ విస్తరణతో ఈ డిమాండ్ మరింత వేగంగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐ మోడళ్లకు అవసరమైన అధిక కంప్యూటింగ్ శక్తి కారణంగా విద్యుత్ వినియోగం గతంతో పోలిస్తే ఎన్నో రెట్లు పెరుగుతోంది. భారత్‌లో ఇప్పటికే విద్యుత్ డిమాండ్ ప్రతి వేసవిలో కొత్త గరిష్ఠ స్థాయిలను తాకుతోంది. పారిశ్రామిక అవసరాలు, ఎయిర్ కండిషనర్ల వినియోగం, విద్యుదీకరణ, ఎలక్ట్రిక్ వాహనాల పెరుగుదలతో విద్యుత్‌పై ఒత్తిడి రోజురోజుకూ అధికమవుతోంది. ఈ సమయంలో భారీ డేటా సెంటర్లు కూడా అదే విద్యుత్ వ్యవస్థపై ఆధారపడితే భవిష్యత్తులో సరఫరా--డిమాండ్ సమతుల్యతను కాపాడటం మరింత క్లిష్టమవుతుంది.

నీటి వినియోగం మరో కీలక అంశం. అనేక డేటా సెంటర్లు శీతలీకరణ కోసం పెద్ద మొత్తంలో నీటిని వినియోగిస్తాయి. నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులు స్థానిక ప్రజల అవసరాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. తాగునీరు, వ్యవసాయం, పరిశ్రమల మధ్య ఇప్పటికే పోటీ పెరుగుతున్న వేళ, కొత్త అవసరాలు జాగ్రత్తగా ప్రణాళిక చేయకపోతే సామాజిక ఉద్రిక్తతలకు దారి తీసే ప్రమాదం ఉంది. హైదరాబాద్ వంటి నగరాలు ఇప్పటికే వేగవంతమైన పట్టణీకరణ, భూగర్భ జలాల క్షీణత, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ఎదుర్కొంటున్నాయి. ఇక్కడ మరిన్ని డేటా సెంటర్లు ఏర్పాటు చేయడం తప్పు కాదు. కానీ వాటికి అవసరమైన విద్యుత్, నీరు ఎక్కడి నుంచి వస్తాయి? స్థానిక మౌలిక సదుపాయాలపై వాటి ప్రభావం ఎంత? పర్యావరణంపై దీర్ఘకాలిక భారం ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. ఇది అభివృద్ధికి వ్యతిరేకంగా చేసే వాదన కాదు. ప్రణాళికలేని అభివృద్ధి పట్ల వ్యక్తమవుతున్న ఆందోళన మాత్రమే. ఒకవైపు డేటా సెంటర్లకు నిరంతర విద్యుత్ అందిస్తూనే, మరోవైపు గ్రామాల్లో రైతులకు విద్యుత్ కోతలు ఉంటే అది సమతుల్య అభివృద్ధి కాదు. పరిశ్రమలకు నీరు సమకూర్చి, ప్రజలు తాగునీటి కోసం క్యూలో నిలబడాల్సి వస్తే అది ప్రగతి కాదు. అందుకే డేటా సెంటర్ల భవిష్యత్తు గ్రీన్ డేటా సెంటర్లు కావాలి. సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాల వినియోగాన్ని తప్పనిసరి చేయాలి. శుద్ధి చేసిన మురుగునీటిని శీతలీకరణకు వినియోగించే విధానాలను ప్రోత్సహించాలి. విద్యుత్ పొదుపు చేసే అధునాతన శీతలీకరణ సాంకేతికతలను అమలు చేయాలి. ప్రతి కొత్త డేటా సెంటర్‌కు పర్యావరణ ప్రభావ అంచనాను మరింత కఠినంగా పరిశీలించాలి. భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ప్రపంచ నాయకత్వం సాధించాలని కోరుకోవడం సహజమే. కానీ ఆ నాయకత్వం భవిష్యత్తు తరాల వనరులను ఖర్చు చేసి సాధించకూడదు. డేటా సెంటర్ల నిర్మాణం దేశానికి అవసరమే. అయితే వాటి విస్తరణకు విద్యుత్ ఉత్పత్తి, నీటి సంరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు వంటి అంశాలను సమాంతరంగా తీసుకెళ్లాలి. డేటా సెంటర్లు దేశ అభివృద్ధికి కొత్త ఇంజిన్లు. కానీ ఇంజిన్ ఎంత శక్తివంతమైనదైనా, ఇంధనం లేకపోతే ప్రయాణం సాగదు. విద్యుత్, నీరు కూడా అంతే విలువైన జాతీయ వనరులు. వాటిని నిర్లక్ష్యం చేస్తూ డిజిటల్ భవిష్యత్తును నిర్మించడం అంటే ఇసుకపై భవనం కట్టినట్టే. డిజిటల్ భారత్ నిర్మాణం అవసరం. కానీ అది విద్యుత్ సంక్షోభం, నీటి కొరత, పర్యావరణ నష్టాల మీద నిర్మితమైతే ఆ అభివృద్ధి సుస్థిరం కాదు. భవిష్యత్తు తరాలు మన గురించి చెప్పాల్సింది "వారు డేటాను కాపాడారు" అని మాత్రమే కాదు; "డేటాతో పాటు ప్రకృతినీ, ప్రజల వనరులనూ కాపాడారు" అనేదే కావాలి. అదే నిజమైన అభివృద్ధి, అదే బాధ్యతాయుత పాలన.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.